సాక్షి గ్రేటర్ వరంగల్

(హనుమకొండ - వరంగల్)

ఆదివారం | 27 | అక్టోబర్ | 2024



క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలతో మానసికోల్లాసం పెంపొందుతుందని నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ రవి కుమార్ అన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో శనివారం క్రీడాపోటీలు కొనసాగాయి. - IIలో



ప్రైవేటీకరణతో ఆర్థిక భారం

రైల్వే ప్రైవేటీకరణతో ప్రజలపై ఆర్థిక భారం పడుతుందని ఏఐఎల్ఆర్ఎస్ఏ సెంట్రల్ ప్రెసిడెంట్ హనుమయ్య అన్నారు. - IIలో

వాతావరణం

గరిష్టం/కనిష్టం $31^0/21^0$

ఉదయం నుంచి చల్లని వాతావరణం ఉంటుంది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా జల్లులు కురిసే అవకాశం ఉంది. మధ్యాహ్నం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.

న్యూస్‌రీల్

కేడీసీలో జాబ్ మేళా




విద్యారణ్యపురి: హనుమకొండలోని కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం జాబ్ మేళా నిర్వహించారు. తెలంగాణ స్కిల్స్ అండ్ నాలెడ్జ్ సెంటర్, ప్లేస్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో టైమ్స్ ప్రో సౌజన్యంతో నిర్వహించిన జాబ్ మేళాకు అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో ప్రముఖ కంపెనీలు మెడ్‌ప్లస్, పేటీఎం, అపోలో ఫార్మసీ, జస్ట్ డయల్ వంటి పలు కంపెనీలు పాల్గొన్నాయి. 300ల మంది నిరుద్యోగ అభ్యర్థులు హాజరయ్యారు. అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేసుకున్నారు. కార్యక్రమంలో ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారెడ్డి, టీఎస్‌కేసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ రాజశేఖర్, ప్లేస్‌మెంట్ విభాగం ఆఫీసర్ యాకూబ్, ఐక్యూఏసీ కో–ఆర్డినేటర్ డాక్టర్ శ్రీనాథ్, డాక్టర్ శివనాగశ్రీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లోనూ ముందుంటాం: సీపీ



హసన్‌పర్తి: శాంతి భద్రతలే కాదు.. సేవా కార్యక్రమాల్లోనూ ముందు వరుసలో ఉంటామని పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా అన్నారు. పోలీస్ అమర వీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని వరంగల్ కమిషనరేట్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఏఆర్, ట్రాఫిక్ పోలీసుల సంయుక్త ఆధ్వర్యంలో ఈకార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది తమ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి పెట్టాలన్నారు. రక్తదానం చేసి మరి కొందరి ప్రాణాలు కాపాడాలన్నారు. ప్రతి ఒక్కరు రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. స్వచ్ఛందంగా రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చిన ఆటో డ్రైవర్లను సీపీ అభినందించారు. ఈసందర్భంగా రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ రవీందర్, అదనపు డీసీపీ సురేశ్‌కుమార్, ఏసీపీలు అనంతయ్య, సురేంద్ర, సత్యనారా యణ, ఆర్ఐలు శ్రీధర్, చంద్రశేఖర్, శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్లు సీతారాంరెడ్డి, రామకృష్ణ, ఎస్సై శ్రవణ్‌కుమార్‌తో పాటు ఎంజీఎం రక్తనిధి సభ్యులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపయోగకర పరిశోధనలపై దృష్టిపెట్టండి



విద్యారణ్యపురి: సమాజానికి ఉపయోగపడే పరిశోధనలపై దృష్టి సారించాలని కెమిస్ట్రీలో పరిశోధన కార్యకలాపాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.జ్యోతి అన్నారు. రెండు రోజులుగా ఆ కళాశాలలో రాయల్ సొసైటీ ఆఫ్ కెమిస్ట్రీ వర్ధన్నపేట, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సహకారంతో 'చిన్న అణువుల వర్ధనలో స్పెక్ట్రో స్కోపీ' పాత్ర అంశంపై నిర్వహిస్తున్న జాతీయ సదస్సు శనివారం ముగిసింది. ఈముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన జ్యోతి మాట్లాడుతూ.. ఈసదస్సులో వివిధ కళాశాలల నుంచి వచ్చి పోస్టర్ ప్రజెంటేషన్లు ఇచ్చి ప్రతిభ చూపిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సమావేశంలో ఆకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి, తెలంగాణ అకాడమీ ఆఫ్ సైన్సెస్ వైస్ ప్రెసిడెంట్ ప్రొఫెసర్ సంజీవరెడ్డి, కేడీసీ ప్రిన్సిపాల్ రాజారెడ్డి, వర్ధన్నపేట కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పోచయ్య, సదస్సు కన్వీనర్లుగా డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ అరుణ వ్యవహరించారు.

ఫిజియోథెరపీతో ఉత్తమ ఫలితాలు

హన్మకొండ: ఫిజియోథెరపీ చికిత్స ద్వారా మంచి ఫలితాలుంటాయని థాయ్‌లాండ్‌కు చెందిన వైద్యులు డాక్టర్ సిరిచాన్ విన్స్, డాక్టర్ ఫ్రిడరికే దెర్థీ అన్నారు. శనివారం హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి కళాశాలలో ఫిజియోథెరపీ విద్యార్థుల కార్యశాల జరిగింది. ఈ సందర్భంగా అతిథులు రుగ్మతను బట్టి ఎలా చికిత్స చేయాలో ప్రాక్టికల్‌గా చూపించారు. కళాశాల సెక్రటరీ సీహెచ్.దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి శిక్షణలు విద్యార్థులకు ఎంతగానో దోహదపడుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంపత్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిరంజీవి, డైరెక్టర్ డాక్టర్ వాహిని దేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రచ్చకెక్కిన గ్రూపులు

పోలీసుశాఖలో కలకలం

- గతంలో బినామీ, ఫేక్ ఫిర్యాదులు.. ఇప్పుడు ఏకంగా కరపత్రాలు
- సీఐ రవికుమార్‌పై పోక్సో కేసుతో మొదలు.. 2004 బ్యాచ్ ఇన్‌స్పెక్టర్లపై ఆరోపణలు
- డబ్బులు, పైరవీలతో పోస్టింగ్‌లు.. ఎమ్మెల్యేల లేఖలపైనా ప్రచారం

క్రమశిక్షణకు మారుపేరైన పోలీసుశాఖలో కొందరి తీరు ఆ శాఖను అప్రతిష్టపాలు చేస్తున్నది. గతంలో ఒకరిపై ఒకరు పరస్పరం బినామీల ద్వారా ఫిర్యాదులు, ఫేక్ కంప్లైంట్లు చేసుకున్న దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడైతే కొందరు పోలీసు ఇన్‌స్పెక్టర్లు ఏకంగా కరపత్రాలు వేసుకునే స్థాయికి విభేదాలు పెరగడం పోలీసు ఉన్నతాధికారుల్లో చర్చనీయాంశం అవుతోంది.

- సాక్షిప్రతినిధి, వరంగల్



వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని కొందరు పోలీస్ ఇన్‌స్పెక్టర్ల మధ్య పోస్టింగ్‌ల విషయంలో గత నాలుగైదు సంవత్సరాలుగా గ్యాప్ పెరిగింది. బీఆర్ఎస్ హయాంలో మొదలైన ఈ పంచాయితీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక తారస్థాయికి వెళ్లింది. అయితే పోటాపోటీగా పోస్టింగ్‌లు తెచ్చుకునే కొందరు ఇన్‌స్పెక్టర్లు గతంలో ఏమన్నా ఉంటే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకునే వారు. ఇప్పుడు ఏకంగా కరపత్రాల ద్వారా దుమ్మెత్తి పోసుకునే స్థాయికి చేరడం పోలీసువర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ప్రధానంగా 2004, 2009 బ్యాచ్‌లకు చెందిన కొందరు ఇన్‌స్పెక్టర్ల మధ్య రగులుతున్న 'పోస్టింగ్'ల పోరు.. చినికి చినికి గాలివానలా మారిందన్న చర్చ జరుగుతోంది.

సంచలనంగా మారిన కరపత్రం..

పోలీసుశాఖలో కలకలం రేపుతున్న కరపత్రంలో ఇటీవల పోక్సో కేసు నమోదైన సీఐ ఎం.రవికుమార్ మీద మొదలైన ఆరోపణలు.. 2004 (ఎస్సై) బ్యాచ్‌కు చెందిన కొందరు సీఐల చుట్టూ తిరిగాయి. ఇందులో కోరుకున్న పోస్టింగ్‌లు ఇస్తున్నారంటూ కొందరు ఎమ్మెల్యేలను కూడా లాగారు. 2004 బ్యాచ్‌కు చెందిన సీఐలు అందరూ కలిసి ఒక నిధి ఏర్పాటు చేసుకున్నారన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. ఈ బ్యాచ్‌కు చెందిన సీఐలే అన్ని సర్కిళ్లలో ఉండాలని.. ఆ నిధి నుంచి డబ్బులు తీసి సంబంధిత ఎమ్మెల్యేలకు ఇచ్చి పోస్టింగ్‌లు తీసుకుంటున్నది నిజమని పేర్కొన్నారు. అందుకే తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా 2004 బ్యాచ్ వాళ్లదే రాజ్యమని, వాళ్లే సంబంధిత ఎమ్మెల్యేలకు ఏడాదికోసారి ఫీజు (డబ్బులు) చెల్లించి పోస్టింగ్ తీసుకుంటున్నారని ఆ కరపత్రంలో ఆరోపించారు. పోస్టింగ్ పొందడం కోసం ప్రజాప్రతినిధులకు ఎంత డబ్బయినా ఇస్తున్నారని.. ఎందుకంటే వారు లా అండ్ ఆర్డర్ పోస్టింగ్, గన్‌మెన్‌లు లేకుండా బతకలేరని, గత 8 సంవత్సరాలుగా పరిశీలిస్తే తెలుస్తోందని పేర్కొన్నారు. ఆ బ్యాచ్‌కు చెందిన కొందరు సీఐలను టచ్ చేస్తే రూ.10 కోట్ల నుంచి రూ.50 కోట్ల అక్రమ ఆస్తులు బయట పడతాయని కరపత్రంలో ఆరోపించడం చర్చనీయాంశంగా మారింది.

ఇంటెలిజెన్స్, ఎస్‌బీ ఆరా..

ఓ వైపు టీజీఎస్‌పీ బెటాలియన్లలో పనిచేస్తున్న పోలీసు సిబ్బంది ధర్నాలకు దిగుతుండగా.. మరో వైపు ఇన్‌స్పెక్టర్లపై కరపత్రాల ప్రచారం ఉన్నతాధికారులకు చికాకు తెప్పిస్తున్నది. కొంతకాలంగా వరంగల్ కమిషనరేట్.. అందులో గ్రేటర్ వరంగల్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల పోస్టింగ్‌లు వివాదాస్పదం అవుతున్నాయి. ఒక వర్గానికి చెందిన ఇన్‌స్పెక్టర్లకు మంచి పోస్టింగ్‌లు దక్కితే.. మరో వర్గం మీడియా, సోషల్ మీడియాకు లీకులు ఇస్తున్నది. వీఆర్‌లోకి వెళ్లిన వారో, కమిషనరేట్ దాటిన వారో పాతసీట్లపై గురిపెట్టి మళ్లీ దక్కించుకుంటే.. ఆ స్థానాలను కోల్పోయిన వారు కూడా అదే పద్ధతిని పాటిస్తున్నారు. సదరు ఇన్‌స్పెక్టర్ల వివాదం పలు సందర్భాల్లో కిందిస్థాయి, పైస్థాయి అధికారులకు కలిసొస్తున్నది. ఇదిలా ఉంటే.. హాట్‌టాపిక్‌గా మారిన కరపత్రాల వివాదం పోలీసు ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆ కరపత్రం వెనుక ఉన్న కీలక వ్యక్తుల వివరాల కోసం ఇంటెలిజెన్స్, స్పెషల్ బ్రాంచ్ అధికారులను రంగంలోకి దింపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఈ వివాదం ఎటు నుంచి ఎటు వెళ్తుందోనన్న చర్చ పోలీసువర్గాల్లో సాగుతోంది.

ఓరుగల్లుకు 'కేబినెట్' వరాలు!

- ఎస్ఎస్‌సీటీయూకు 211 ఎకరాల స్థలం..
- రెవెన్యూ డివిజన్‌గా ఏటూరునాగారం
- హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధి పెంపు..
- అనివార్యంగా 'కుడా' విస్తరణ..



సాక్షిప్రతినిధి, వరంగల్ :

రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఓరుగల్లు పెండింగ్ అంశాలను క్లియర్ చేసింది. సుదీర్ఘంగా సాగిన సమావేశంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలు, తీర్మానాలు ఉమ్మడి జిల్లాకు మేలు చేసేవిగా ఉన్నాయి. సమ్మక్క–సారలమ్మ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి (ఎస్ఎస్‌సీటీయూ) ఎప్పటి నుంచో ఉన్న భూసమస్య తీరింది. గిరిజన యూనివర్సిటీ తరగతి గదుల నిర్మాణానికి 500 ఎకరాల స్థలం కావాలని కేంద్ర ఉన్నత విద్యామండలి కోరగా.. రెవెన్యూ, అటవీశాఖ అధికారులు ఉమ్మడి సర్వే నిర్వహించి బండారుపల్లి గ్రామ శివారు పరిధిలోని 837, 53/1 సర్వే నంబర్‌లో 367 ఎకరాల నుంచి 335.4 భూమిని సేకరించింది. 2017 ఫిబ్రవరి 13వ తేదీన పరిశీలనకు వచ్చిన మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ (ఎంహెచ్ఆర్డీ)కి అప్పటి కలెక్టర్ ఆధ్వర్యంలో చూపించారు. పార్లమెంట్ ఎన్నికలకు ముందు మహబూబ్‌నగర్‌లో ప్రధాని మోదీ రూ.900 కోట్లు ప్రకటించినా భూసమస్య అలాగే ఉంది. శనివారం రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో ఎస్ఎస్‌సీటీయూకు 211 ఎకరాల భూమిని సేకరించి ఇచ్చేందుకు తీర్మానం చేయడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. ములుగు జిల్లా ఏర్పాటు తర్వాత పెండింగ్‌లో ఉన్న ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్‌కు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఏటూరునాగారం రెవెన్యూ డివిజన్ కోసం మంత్రి సీతక్క పలుమార్లు ప్రభుత్వానికి ప్రతిపాదించారు. గతేడాది అక్టోబర్ 7న జీఓ జారీ అయిన తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు. ఏటూరునాగారం, మంగపేట, కన్నాయిగూడెం, వాజేడు, వెంకటాపురం(కె), ఎస్ఎస్‌తాడ్వాయి మండలాలతో రెవెన్యూ డివిజన్ ఏర్పాటుకు కేబినెట్ తీర్మానం చేసింది. ములుగు డివిజన్ నుంచి ఇప్పటికే పరకాల మండలం పరకాల రెవెన్యూ డివిజన్‌కు, కొత్తగూడ నర్సంపేట డివిజన్‌కు వెళ్లగా.. ములుగు, వెంకటాపురం, గోవిందరావుపేట, మల్లంపల్లి మండలాలతో ములుగు రెవెన్యూ డివిజన్ ఉంటుంది. కాగా, ప్రభుత్వం గతంలో ప్రకటించిన సన్నధాన్యానికి రూ.500 బోనస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వడంతో ఉమ్మడి వరంగల్‌కు చెందిన రైతులకు మేలు జరగనుంది. వానాకాలంలో ఉమ్మడి జిల్లాలో 9,02,233 ఎకరాల్లో వరి సాగు కాగా 12,28,000 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేసిన అధికారులు 1,128 కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు సన్నాహాలు చేశారు. అయితే 12.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యంలో 90 శాతం సన్నరకాలే కావడం వల్ల.. అవి సాగుచేసిన రైతులకు రూ.500 చొప్పున బోనస్ లభించనుంది. ఇదిలా ఉండగా దీపావళి కానుకగా నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు కేబినెట్ నిర్ణయించింది. ఉమ్మడి జిల్లా పరిధిలో సుమారు 42వేల మంది అర్హులకు లబ్ధి చేకూరనుంది.

జిల్లాల పరిధి విస్తరణ..!

హనుమకొండ, వరంగల్ జిల్లాల పరిధిని పెంచాలని నిర్ణయించినా.. విధివిధానాలు, విస్తరించే ఆయా జిల్లాల పరిధిపై స్పష్టత ఇవ్వలేదు. ప్రస్తుతం హనుమకొండ జిల్లాలో హనుమకొండ, పరకాల రెవెన్యూ డివిజన్ల పరిధిలో 14 రెవెన్యూ మండలాలు, 105 రెవెన్యూ గ్రామాలున్నాయి. జిల్లా మొత్తం జనాభా 9,05,744, వైశాల్యం 1688.75 చదరపు కిలోమీటర్లుగా ఉంది. ఇక వరంగల్ జిల్లాలో వరంగల్, నర్సంపేట రెవెన్యూ డివిజన్లు, 13 రెవెన్యూ మండలాలు, 192 రెవెన్యూ గ్రామాలు 8,93,715 జనాభాతో 1805.37 చదరపు కిలోమీటర్ల వైశాల్యంగా ఉంది. ఇదిలా ఉండగా హనుమకొండ, వరంగల్ జిల్లాల విస్తరణతో పాటు కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా) పరిధి కూడా పెరగనుంది. 181గా ఉన్న గ్రామాల సంఖ్య సుమారు 281కి చేరనుండగా.. ఈ మేరకు ఇప్పటికే 'కుడా' పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయి.

మినీ జాతరకు ముహూర్తం

- తేదీలు ఖరారు చేసిన మేడారం పూజారులు
- ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జాతర



ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం శ్రీ సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు ముహూర్తం ఖరారైంది. 2025 ఫిబ్రవరి 12 నుంచి 15వ తేదీ వరకు మినీ జాతర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వనదేవతల పూజారులు నిర్ణయించారు. ఈ మేరకు శనివారం మేడారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు మాట్లాడుతూ ఖరారు చేసిన మినీ జాతర తేదీల లేఖను ములుగు కలెక్టర్ దివాకరన్ టీఎస్, మేడారం ఈఓ రాజేంద్రంకు అందజేయనున్నట్లు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే మినీ మేడారం జాతరకు భక్తులు హాజరై అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకోవాలన్నారు.

మూడు నెలల ముందుగానే..

ఈసారి మినీ మేడారం జాతర తేదీలను పూజారులు మూడు నెలల ముందుగానే ప్రకటించారు. మినీ జాతరకు కూడా భక్తులు లక్షల సంఖ్యలో హాజరు కానున్న నేపథ్యంలో.. వారికి ప్రభుత్వం సౌకర్యాలు కల్పించేందుకు ముందస్తుగా తేదీలను ఖరారు చేసినట్లు పూజారులు తెలిపారు. సంక్రాంతి పండుగ సెలవుల నుంచి మినీ జాతరకు భక్తుల రద్దీ పెరగనుంది. 10 లక్షల మందికి పైగా భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా. ఇప్పటికే మంత్రి సీతక్క మినీ జాతరలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలపై పలుమార్లు జిల్లా అధికారులతో సమీక్షించారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి



మినీ మేడారం జాతరకు వచ్చే భక్తులకు ప్రభుత్వం సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. ఇందుకు మూడు నెలల ముందే జాతర తేదీలను ఖరారు చేశాం. మంత్రి సీతక్క మినీ జాతర సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించారు. చిన్న జాతరకు కూడా లక్షలాది మంది భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో వారు ఇబ్బందులు పడకుండా తాగునీరు, జంపన్నవాగు వద్ద షవర్లతోపాటు రోడ్ల మరమ్మతు చేపట్టాలి.

- సిద్ధబోయిన జగ్గారావు, పూజారుల సంఘం అధ్యక్షుడు

ముగిసిన 'కృతి-24' సదస్సు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కాళీ ప్రసాద్‌రావు

రామన్నపేట: వరంగల్ కాకతీయ మెడికల్ కళాశాలలోని ఎన్ఆర్ఐ హాల్‌లో రెండ్రోజులుగా జరుగుతున్న కృతి-24 రాష్ట్ర సదస్సు శనివారం రాత్రి అట్టహాసంగా ముగిసింది. ఈసదస్సుకు దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వైద్య విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులు వైద్యపరమైన నిబద్ధత, విశేష సాంకేతిక చర్యలతో సదస్సు కొనసాగింది. ముగింపు సమావేశానికి ముఖ్య అతిథులుగా డాక్టర్ శ్రీలత తుముల, కృతి అధ్యక్షుడు కె.రామ్‌కుమార్‌రెడ్డి, కన్వీనర్ పున్నం సుజీత్, ఐఎంఏ తెలంగాణ అధ్యక్షుడు కాళీప్రసాద్‌రావు, ఏపీపీఐ అధ్యక్షుడు సతీశ్, డాక్టర్ సంధ్య, నర్సంపేట మెడికల్ కాలేజీ ప్రిన్స్‌పాల్ మోహన్‌దాస్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కృతి సదస్సును ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

హన్మకొండ: కాళోజీ కళాక్షేత్రంలో కళాకారుల విగ్రహాలు ఏర్పాటు చేయాలని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కన్నం సునీల్, ఎస్ఐఎస్ఓ రాష్ట్ర అధ్యక్షుడు దూడపాక నరేశ్ డిమాండ్ చేశారు. శనివారం హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఈనెల 28న జరిగే కళాకారుల విగ్రహాల ఏర్పాటు పోరాట సభ కరపత్రాలను విద్యార్థి సంఘాల నాయకులు విడుదల చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. సోమవారం ఉదయం 11 గంటలకు బాలసముద్రంలో కాళోజీ కళాక్షేత్రం ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో పోరాట సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తెలంగాణ కళాకారులను, కళారూపాలను అవమానపర్చేలా విగ్రహాలను ఏర్పాటు చేయొద్దన్నారు. గద్దర్, గూడ అంజయ్య, సాయి చంద్, చిందు ఎల్లమ్మ, మిద్దె రాములు, చుక్క సత్తయ్య లాంటి వారి విగ్రహాలు ఏర్పాటు చేయాలన్నారు. ఈపోరాట సభకు అన్ని వర్గాల ప్రజలు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు మణితేజ, కుమార్, విజయ్, సంతోశ్, మహేందర్, సిద్ధు పాల్గొన్నారు.

పనుల్లో వేగం పెంచాలి



వ్యాపారులు, అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్: వరంగల్ లక్ష్మీపురంలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని కమిషనర్ డాక్టర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. శనివారం రాత్రి ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను ఆమె పరిశీలించారు. ఇప్పటి వరకు పూర్తయిన పనుల వివరాలను సంబంధిత ఇంజనీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.నిర్మల, వరంగల్ ఈఈ శ్రీనివాస్, డీఈ రాజ్‌కుమార్, పండ్ల వ్యాపారుల సంఘం అధ్యక్షులు వెల్ది సాంబయ్య, చెన్నమల్లు, వెల్ది సతీశ్ పాల్గొన్నారు.


గ్రేటర్ అదనపు కమిషనర్‌గా జోనా

వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా పోలెపాక జోనాను నియమిస్తూ మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిషోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న అదనపు కమిషనర్ రాజేందర్‌రెడ్డిని సీడీఎంఏ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. వర్ధన్నపేట మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న జోనా కోసమే రాజేందర్ రెడ్డిని అధికార పార్టీ నేతలు బదిలీ చేయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

2న బహిరంగ విచారణ

కాజీపేట అర్బన్: స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌పై నవంబర్ 2న జిల్లాకు రాష్ట్ర బీసీ కమిషన్ బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు బీసీ వేల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ జి.రామ్‌రెడ్డి తెలిపారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో శనివారం అన్ని బీసీ కుల సంఘాలతో నిర్వహించిన సమావేశంలో బీసీ వెల్ఫేర్ డీడీ రామ్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బహిరంగ విచారణలో రాజకీయ, సామాజిక, ఆర్థికపరమైన అభ్యర్థనలకు, సలహాలు, సూచనలు అందజేసేందుకు బీసీ సంఘాల ప్రతినిధులు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజాన్ని నిర్మిద్దాం



మాట్లాడుతున్న నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ

కాజీపేట అర్బన్: అవినీతి రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరం కృషి చేద్దామని నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ అన్నారు. నిట్ వరంగల్‌లోని సెమినార్ హాల్ కాంప్లెక్స్‌లో శనివారం నిర్వహించిన విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ కార్యక్రమంలో నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ పాల్గొని మాట్లాడారు. వ్యక్తిగత, వృత్తిపరమైన రంగాల్లో పారదర్శకత, జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, ప్రొఫెసర్ వేణు గోపాల్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

యువత మత్తుకు బానిస కావొద్దు

- డీఆర్‌ఓ వైవీ గణేశ్
- కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ గణేశ్

విద్యారణ్యపురి: ఉజ్వల భవిష్యత్ కలిగిన యువత మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దని హనుమకొండ డీఆర్‌ఓ వైవి గణేశ్ అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో 'యువత మత్తు పదార్థాల నియంత్రణ'పై హనుమకొండ డీఆర్‌ఓ వైవీ గణేశ్ సెంట్రల్‌జోన్ డీసీపీ సలీమా, ఇతర శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇందులో ఆయన మాట్లాడుతూ.. ఆయా శాఖల ఆధ్వర్యంలో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు వివరించారు. అనంతరం డీఆర్‌ఓ మాట్లాడుతూ.. యువత మత్తుపదార్థాలకు అలవాటు కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత వారి కుటుంబాలపై ఉంటుందన్నారు. తమ పిల్లల ఆహారపు అలవాట్లపై కూడా తల్లిదండ్రులు నిఘా ఉంచాలన్నారు. విద్యా సంస్థల పరిసర ప్రాంతాల్లోని పాన్‌షాపులు, సిగరెట్ విక్రయ కేంద్రాల్లో నిరంతరం నిఘా ఉంచాలన్నారు. మత్తు పదార్థాలను అరికట్టడంలో పోలీసులదే కీలక పాత్ర అని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే కమర్షియల్‌కు సంబంధించి అనుమానాస్పదంగా ఉన్న ప్రతీ వాహనాన్ని తనిఖీ చేయాలన్నారు. కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని పోలీస్ అధికారులకు సూచించారు. సమావేశంలో పరకాల ఆర్డీఓ నారాయణ, జిల్లా సంక్షేమ అధికారి జయంతి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్, నార్కోటిక్స్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

ఇక్కడే జాయినింగ్.. రిటైర్మెంట్

ఇష్టారాజ్యంగా సిబ్బంది విధులు



వరంగల్: గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌లో కారుణ్య నియామకాలతో ఉద్యోగంలో చేరిన పలువురు బల్దియాను వదలలేక పోతున్నారు. ఉద్యోగంలో చేరి పలు పదోన్నతులు పొందినా ఇక్కడే పోస్టింగ్‌లు పొందుతూ బల్దియాను పట్టుకుని వేలాడుతున్నారు. పెద్ద స్థాయిలో పదోన్నతులు పొందిన సమయంలో తప్పనిసరి పరిస్థితుల్లో వరంగల్‌ను వీడినా ఏడాది లోపలే మళ్లీ ఇక్కడికి వస్తున్నారు. వీరికి స్థానిక ప్రజాప్రతినిధుల అండ ఉండడంతోనే పోస్టింగ్ పొందుతున్నారన్న ఆరోపణలు వినిస్తున్నాయి. లోకల్ ఆఫీసర్లు యథా స్థానంలోకి రావడంతో కార్పొరేషనల్‌లో వీరి దందా మూడు పువ్వులు.. ఆరు కాయలుగా సాగుతున్నట్లుగా తెలుస్తోంది. ఇక్కడ సానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పరకాలకు పదోన్నతిపై వెళ్లిన అధికారి ఏడాదిలోనే లోకల్‌కు వచ్చారు. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి వివిధ స్థాయిలో ఇక్కడ డీసీగా పనిచేస్తున్న సమయంలో ఎన్నికలు రావడంతో లోకల్ అధికారి ఉన్నత స్థాయిలో ఉండొద్దన్న ఈసీ నిబంధనలతో వర్ధన్నపేట మున్సిపాలిటీకి కమిషనర్‌గా వెళ్లిన అధికారి మళ్లీ అదనపు కమిషనర్‌గా రావడం హాట్ టాపిక్‌గా మారింది. ఉద్యోగి నుంచి ఉన్నతాధికారులుగా ఇక్కడ పనిచేయడం వల్ల సిబ్బందితో సంబంధాలు ఉండడంతో వీరి విధుల నిర్వహణపై పర్యవేక్షించే అధికారులకు కష్టంగా మారిందని సమాచారం. గ్రేటర్ ముఖ్య ప్రజాప్రతినిధికి దగ్గరైనందునే అన్ని పనులు చక్కపట్టేందుకే ఇక్కడ అధికారిని బదిలీ చేయించి ఆయన స్థానంలో ఉన్నతాధికారిని తీసుకువస్తున్నారన్న ప్రచారం ఉంది.

భూగర్భ జలాల పెంపునకు చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న భూగర్భ జలశాఖ ఉప సంచాలకులు శైలశ్రీ మల్లికాదేవి

విద్యారణ్యపురి: ప్రధాన వనరైన వర్షపు నీటిని వృథా కాకుండా భూగర్భజలాలను భూమిలో ఇంకేలా కృషి చేయాలని భూగర్భ జల శాఖ ఉపసంచాలకులు శైలశ్రీమల్లికాదేవి అన్నారు. శనివారం భూగర్భజలశాఖ హనుమకొండ ఆధ్వర్యంలో పీస్ ఫర్ ఆల్ నేషన్స్ స్వచ్ఛంద సంస్థ హనుమకొండలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో భూగర్భ జలాల పెంపు–నిర్వహణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఇంటిలో, పరిశ్రమల్లో, కార్యాలయాల్లో, పాఠశాలల్లో ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మొక్కలు నాటి నీటి ప్రవాహాన్ని అడ్డుకోవాలని సూచించారు. పాఠశాల హెచ్ఎం సుధాకర్‌రావు, భూగర్భ జలశాఖ అధికారులు సంగీత, శృతి, ధరంసింగ్, పీస్ ఫర్ ఆల్ నేషన్స్ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ సాల్మన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

వరంగల్: వరంగల్‌కు చెందిన మైనర్ బాలికపై అత్యాచారయత్నం కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు ఇంతేజార్‌గంజ్ సీఐ షుకూర్ తెలిపారు. నిజామాబాద్‌కు చెందిన సబీల్ అనే యువకుడితో ఇన్‌స్టాగామ్‌లో నగరానికి చెందిన మైనర్ బాలికతో పరిచయం ఏర్పడింది. యువకుడితో చాటింగ్ చేయడంతో నిజామాబాద్‌కు రమ్మని పిలుపురావడంతో బాలిక అక్కడికి వెళ్లగా అత్యాచారానికి సబీల్ ప్రయత్నించాడని ఫిర్యాదు రావడంతో కేసు నమోదు చేసి నిందితున్ని అరెస్ట్ చేసినట్లు తెలిపారు.

ఆత్మకూరులో వ్యక్తిపై కేసు నమోదు

ఆత్మకూరు: మండలానికి చెందిన మాదాసి నితిన్.. ఇదే మండలానికి చెందిన ఓ బాలికను మాయమాటలతో లైంగికంగా లోబరచుకుని మోసం చేయగా బాధితురాలి తల్లిదండ్రులు శనివారం ఆత్మకూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నితిన్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్లు సీఐ సంతోష్ తెలిపారు.

బంగారం చోరీ

వరంగల్ : ఇంతేజార్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కొత్తవాడ 80 ఫీట్ల రోడ్ సమీపంలోని తన ఇంటిలోని బీరువాలో 11 తులాల బంగారం కనిపించకుండా పోయిందని షబానా శనివారం ఫిర్యాదు చేసిందని సీఐ షుకూర్ తెలిపారు. తన భర్త ఉద్యోగరీత్యా దుబాయ్‌లో ఉంటున్నాడని, ఈనెల14న కూరగాయల మార్కెట్‌కు వెళ్లి ఇంటికి వచ్చింది. అదే రోజున అనుమానం వచ్చి బీరువా తెరిచి చూడగా అందులో పెట్టిన బంగారం పోయినట్లు గుర్తించింది. ఇంటికి, బీరువాకు వేసిన తాళం వేసి వేసినట్లు ఉందని, బంగారం మాత్రం పోయిందని, బంధువులపైనే అనుమానం ఉన్నట్లు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దీపావళి మందుగుండు సామగ్రి స్వాధీనం

- ఇద్దరిపై కేసు నమోదు



స్వాధీనం చేసుకున్న దీపావళి మందుగుండు సామగ్రితో పోలీసులు

హసన్‌పర్తి : మండలంలోని అర్వపల్లిలో శుక్రవారం అర్ధరాత్రి భారీగా దీపావళి మందుగుండు సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సామగ్రి విలువ రూ.24, 23,400 ఉంటోందని సీఐ చేరాలు తెలిపారు. అర్వపల్లికి చెందిన గుళ్లపల్లి రాజు, గుళ్లపల్లి రమేష్ ఇంట్లో భారీ మొత్తంలో దీపావళి మందుగుండు సామగ్రి నిల్వ ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో సీఐ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ప్రభుత్వ అనుమతి లేకుండా మందుగుండు సామగ్రి నిల్వ చేసినట్లు పోలీసులు గుర్తించారు. విక్రయదారుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదు. అక్రమంగా నిల్వ ఉన్న మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ చేరాలు తెలిపారు. రాజు, రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ చెప్పారు.



రైల్వే ప్రైవేటీకరణతో ఆర్థికభారం

- ఏఐఎల్ఆర్ఎస్ఏ సెంట్రల్ వైస్‌ప్రెసిడెంట్ హనుమయ్య



సమావేశంలో జోనల్, డివిజన్ నేతలతో కాజీపేట బ్రాంచ్ బాధ్యులు

కాజీపేట రూరల్ : రైల్వేల ప్రైవేటీకరణతో ప్రజలపై ఆర్థికభారం పడుతుందని ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ (ఏఐఎల్ఆర్ఎస్ఏ) సెంట్రల్ వైస్ ప్రెసిడెంట్ టి.హనుమయ్య తెలిపారు. కాజీపేటలోని రైల్వే కమ్యూనిటి హాల్‌లో శనివారం కాజీపేట, సికింద్రాబాద్ డివిజన్ అసోసియేషన్ ద్వైవార్షిక సమావేశం నిర్వహించారు.ఆయా డిపోల నుంచి 250 మంది ప్రతినిధులు హాజరయ్యారు. అనంతరం హనుమయ్య మాట్లాడుతూ..రన్నింగ్ సిబ్బందికి 46 గంటల వారాంతపు విశ్రాంతి ఇవ్వాలని, గూడ్స్ రైళ్లలో 8 గంటల డ్యూటీ, కోచింగ్‌లో 6 గంటలకు పరిమితం చేయాలన్నారు. రన్నింగ్ స్టాఫ్‌ను 36 గంటల లోపు హెడ్‌క్వార్టర్‌కు తీసుకురావాలని, మైలేజ్ అలవెన్స్‌ను పెంచాలని, ఖాళీలను భర్తీ చేయాలని తెలిపారు. కాజీపేట క్రూ లింక్‌లను ఎక్కడికి తరలించరాదని, వరంగల్ కేంద్రంగా క్రూ లింక్‌ల ఆపరేటింగ్ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అసోసియేషన్ జోనల్ కార్యదర్శి జిలానిభాషా, సీఐటీయూ నాయకుడు రాగుల రమేశ్, డివిజనల్ ప్రెసిడెంట్ ఏవీఎస్ఎన్.మూర్తి, డివిజనల్ కార్యదర్శి శ్రీజిత్, సంఘ నాయకుడు పాక రాజ్‌కుమార్, డీఎంఆర్‌కెఎస్ నుంచి మంచాల రమేష్, రైల్వే ఓబీసీ నాయకుడు ఆర్.రమేష్ మాట్లాడారు. ప్రధాన డిమాండ్ల పరిష్కారానికి కేంద్ర కమిటీతో కార్యచరణ చేపడుతామని నూతనంగా ఎన్నికైన కాజీపేట బ్రాంచ్ సెక్రటరీ అనిల్‌కుమార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎం.కె.మూర్తి, గోవిందరాజు, సుధీర్ కేసి, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్యశారద
- కలెక్టరేట్‌లో దివ్యాంగులు, వృద్ధులకు ప్రత్యేక ప్రజావాణి



కలెక్టర్ సత్య శారదకు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు

కాశోజీ సెంటర్: ప్రత్యేక ప్రజావాణిలో దివ్యాంగులు, వృద్ధుల నుంచి స్వీకరించిన ఫిర్యాదులను మానవతా దృక్పథంతో సకాలంలో పరిష్కరించాలని వరంగల్ కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శనివారం దివ్యాంగులు, వయోవృద్ధుల ప్రత్యేక ప్రజావాణి నిర్వహించారు. ఈ సందర్భంగా వారి నుంచి వినతులను స్వీకరించారు. పలు శాఖల అధికారులు ప్రజావాణికి రాకపోవడంతో మెమోలు జారీ చేయాలని సూచించారు. నాలుగు దరఖాస్తులు పింఛన్లు, ఒకటి అంత్యోదయ కార్డుకు, మూడు దరఖాస్తులు త్రీవీలర్ బ్యాటరీ మోటారు సైకిళ్ల కోసం వచ్చాయని అధికారులు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలి

సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దివ్యాంగులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలల నుంచి మీ సేవ కేంద్రాల్లో సదరం స్లాట్ బుక్ కావడం లేదు. 2011 నుంచి ఇప్పటి వరకు సదరం సర్టిఫికెట్లు తీసుకున్న కొంతమందికి మాత్రమే ఐడీ కార్డులను అంగన్‌వాడీ టీచర్లు పంపిణీ చేశారు. ఇంకా చాలా మందికి రాలేదు. మీ సేవలో తీసుకున్నట్లు చూపెడుతుంది. దివ్యాంగులకు ఒక భవనం నిర్మించాలి. ఇందిరమ్మ ఇళ్లలో దివ్యాంగులకు ఐదు శాతం రిజర్వేషన్లు కల్పించాలి.

- బండి చక్రపాణి, నవ తెలంగాణ దివ్యాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

సమస్యలపై మంత్రులు చొరవచూపాలి

- టీఎస్ఈఈయూ–327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్



మాట్లాడుతున్న ఇనుగాల శ్రీధర్

హన్మకొండ : సమస్యలు తెలుసుకునేందుకు మంత్రులు చొరవ చూపాలని ఐఎన్‌టీయూసీ అనుబంధ తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ -327 రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఇనుగాల శ్రీధర్ కోరారు. శనివారం హనుమకొండ వడ్డెపల్లి రోడ్డులోని యూనియన్ కార్యాలయంలో టీఎస్ఈఈయూ–327 ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని శ్రీధర్ ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని 2003 వరకు అమలు చేస్తుండగా విద్యుత్ సంస్థలు మాత్రం 1999 జనవరి వరకే అమలు చేస్తున్నాయని, ఉద్యోగులందరికి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎన్ఎంఆర్లు, విలేజ్ ఎలక్ట్రిక్ వర్కర్‌లను రెగ్యులర్ చేయించామని, కాంట్రాక్ట్ కార్మికులు, ఔట్ సోర్సింగ్ కార్మికులను ఆర్టిజన్‌లుగా సంస్థలోకి తీసుకోవడంలో యూనియన్ కీలక భూమిక పోషించిందన్నారు.ఈ సమావేశంలో టీఎస్ఈఈయూ ఎస్పీడీసీఎల్ అధ్యక్షుడు పి.మహేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దొనికల సదయ్య, కార్యదర్శి చిట్ల ఓదేలు, వరంగల్ జిల్లా కార్యదర్శి మచ్చిక బుచ్చయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమయ్య, నాయకులు రవికుమార్, బాబు, శరత్, విజయ్‌పాల్ రెడ్డి, సికిందర్ పాల్గొన్నారు.

ప్రాణం ఖరీదు రూ. 8 లక్షలు

ఐనవోలు : పొట్టకూటి కోసం రాష్ట్రాన్ని దాటి వచ్చిన ఓ వలస జీవి ప్రాణం ఖరీదు రూ.8 లక్షలుగా నిర్ణయించారు. మండలంలోని వనమాల కనపర్తిలోని వీరాంజనేయ క్వారీలో బిహార్‌కు చెందిన సుబోద్ యాదవ్ (36) ప్రమాదానికి గురై శుక్రవారం మృతి చెందిన సంఘటన తెలిసిందే. సుబోద్ యాదవ్ ఎక్స్‌కావేటర్ ఆపరేటర్‌గా పనిచేస్తాడు. కానీ అతడికి తెలియని పనిని బలవంతంగా (గ్రానైట్ కటింగ్ పనులు) యజమాన్యం చేయించడంతో ప్రమాదం జరిగి నిండుప్రాణం పోయిందని కార్మికులు వాపోతున్నారు. ఈ ప్రమాదాన్ని యజమాన్యం గోప్యంగా దాచే ప్రయత్నం చేసింది. కార్మికులు ప్రశ్నించడంతో యజమాని తమ అనునాయులను రంగంలోకి దించారు. నయానో భయానో సుబోద్ యాదవ్ మృతికి రూ.8 లక్షలు చెల్లించే విధంగా ఒప్పందం చేసుకున్నారు. అందులో భాగంగా కొంత మొత్తం ఇచ్చి అంబులెన్స్‌లో మృతదేహాన్ని అతడి సొంత రాష్ట్రానికి తరలించారు. పని ప్రదేశంలో ఉద్యోగికి కల్పించాల్సిన అన్ని రక్షణ చర్యలు తీసుకుంటే ప్రమాదం జరుగకుండా ఉండేదని.. నిబంధనలకు విరుద్ధంగా క్వారీలో పనులు జరుగుతున్నందునే యజమాన్యం డబ్బులు చెల్లించడానికి ఒప్పుకుందని కార్మికులు విమర్శిస్తున్నారు. మృతుడికి భార్య, చిన్నబాబు ఉన్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం కారణంగానే ప్రమాదాలు జరుగుతున్నాయని కార్మికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

- నిట్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న రవికుమార్

వరంగల్ స్పోర్ట్స్ : క్రీడలతో మానసిక, శారీరక దృఢత్వం పెంపొందుతాయని నిట్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ డాక్టర్ రవికుమార్ అన్నారు. హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహిస్తున్న ఎస్‌జీఎఫ్ఐ అండర్–19 క్రీడా పోటీలు శనివారం కొనసాగాయి. ఈ సందర్భంగా రవికుమార్, హనుమకొండ డీవైఎస్ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి ఏదైనా ఇష్టమైన క్రీడల్లో సాధన చేయాలన్నారు. నిట్ పీడీ డాక్టర్ హరి, రమణ, వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, డీఎస్ఏ కోచ్‌లు, పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ముగ్గురి అరెస్ట్



సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ దేవేందర్ రెడ్డి

హన్మకొండ : దోపిడీ కేసులో ముగ్గురిని అరెస్టు చేసినట్లు హనుమకొండ ఏసీపీ కొత్త దేవేందర్ రెడ్డి తెలిపారు. శనివారం సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హనుమకొండకు చెందిన కీర్తి రవీందర్ ఈ నెల 13న న్యూశాయంపేటలోని ఆయన స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లాడని తెలిపారు. ఇదే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు వచ్చి కీర్తి రవీందర్‌పై దాడి చేసి కొట్టి బంగారు చైన్, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారన్నారు. రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపట్టామన్నారు. రవీందర్ రెగ్యులర్ డ్రైవర్ దసరా పండుగకు ఇంటికి వెళ్లడంతో తాత్కాలికంగా నర్సంపేట మండలం రాజుపేటకు చెందిన బైరి రామును డ్రైవర్‌గా పెట్టుకున్నాడని తెలిపారు. తాను నడుపుతున్న కారు యజమాని బంగారు ఆభరణాలు వేసుకుని తిరుగుతాడని అతని మిత్రులు నర్సంపేట మండలం రాజుపేట, నల్లబెల్లి మండలం మేడపల్లికి చెందిన ఓర్సు గణేష్‌కు చెప్పి ఒక పథకం ప్రకారం తాను వెళ్లిన చోటు సమాచారం అందించడంతో ఇరువురు న్యూశాయంపేట కట్ట వద్దకు చేరుకుని దాడి చేసి బంగారు చైన్, సెల్‌ఫోన్ ఎత్తుకెళ్లారని వివరించారు. తన మీద ఎలాంటి అనుమానం రాకుండా ఉండేందుకు తనపై కూడా దాడి చేసి ఆభరణాలు ఎత్తుకెళ్లాలని చెప్పిన మేరకు వచ్చిన ఇరువురు డ్రైవర్ రామును కొట్టారన్నారని తెలిపారు. కేసు విచారణ చేస్తున్న సమయంలో వచ్చిన పక్కా సమాచారం మేరకు శనివారం హనుమకొండ ఏషియన్‌మాల్ జితేందర్ సింగ్ నగర్ వద్ద ఉన్నట్లు సమాచారం రావడంతో బైరి రాము, రావుల అరుణ్ కుమార్, ఓర్సు గణేష్‌ను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1.58 లక్షలు, మూడు సెల్‌ఫోన్లు, రోల్డ్‌గోల్డ్ చైన్, ఉంగరం స్వాధీనం చేసుకున్నామని వివరించారు. ఓర్సు గణేష్ మరో రెండు కేసుల్లో నిందితుడని తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబరిచిన ఏఎస్ఐ పి.పాపయ్య, కానిస్టేబళ్లు సత్యనారాయణ, లియాకత్ అలీ, ప్రభాకర్‌ను ఏసీపీ అభినందించి, నగదు రివార్డు అందించారు. సమావేశంలో సుబేదారి సీఐ సత్యనారాయణ రెడ్డి, ఎస్సై ఫణీందర్ పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడే దొంగలు..

- 8 సెల్‌ఫోన్లు స్వాధీనం, ల్యాప్‌టాప్, మొబైల్ రికవరీ



వివరాలు వెల్లడిస్తున్న జీఆర్పీ సీఐ సురేందర్

కాశిబుగ్గ : రైళ్లలో చోరీలు చేస్తూ తప్పించుకుని తిరుగుతున్న దొంగలను వరంగల్ రైల్వే పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 8 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని ఓ ల్యాప్‌టాప్, మొబైల్ ఫోన్ రికవరీ చేశారు. వరంగల్ జీఆర్పీ సీఐ పి.సురేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం రూరల్ పెద్ద తండా జలగంనగర్‌కు చెందిన పండ్ల వ్యాపారి గద్దల రామకృష్ణ, ఆటో డ్రైవర్ బానోత్ సాయికుమార్, ఖమ్మం రూరల్ రావిచెట్టు బజార్‌లో నివాసం ఉంటున్న బైక్ మెకానిక్ దుబ్బాకుల కిషోర్ కలిసి రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. శనివారం జీఆర్పీ, ఆర్‌పీఎఫ్, సీఐబీ సిబ్బంది సంయుక్తంగా వరంగల్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం–1లో తనిఖీలు నిర్వహిస్తుండగా ఈ ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించడంతో తనిఖీ చేయగా 8 సెల్‌ఫోన్లు లభించాయి. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా గత పది రోజులుగా ఖమ్మం, వరంగల్ రైల్వేస్టేషన్‌లలో సెల్‌ఫోన్లు దొంగలించారని తేలింది. పది రోజుల క్రితం గోదావరి ఎక్స్‌ప్రెస్ రైలులో ఓ బ్యాగు దొంగిలించి హెచ్‌పీ ల్యాప్‌టాప్, ఓ మొబైల్ ఫోన్‌ను ఖమ్మం పెద్ద తండాలోని వేద సెల్‌ఫోన్ షాపులో విక్రయించగా.. వాటిని రికవరీ చేశామని సీఐ తెలిపారు. సుమారు రూ.1,24,000 విలువైన వస్తువులను స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్టు చేసినట్లు పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో జీఆర్పీ సిబ్బంది డి.రాము, ఎం.నాగరాజు, ఆర్‌పీఎఫ్ సిబ్బంది పి.వెంకటేశ్వరరావు, ఎస్.రాజు, సీఐబీ సిబ్బంది సీహెచ్.త్రిమూర్తులు, ఎస్.రమేష్, మనోజ్ పాల్గొన్నారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి..

కాజీపేట : పట్టణంలో గంజాయి విక్రయించడానికి ప్రయత్నిస్తున్న ఓ వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించినట్లు సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శనివారం రాత్రి సీఐ మాట్లాడుతూ వరంగల్ నగరంలోని కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన నల్ల గుణచందర్ (34) జల్సాలకు అలవాటు పడి కష్టపడకుండా డబ్బులు సంపాదించడం కోసం గంజాయి విక్రయిస్తున్నాడు. ఎస్సై నవీన్‌కుమార్ కాజీపేటలో పెట్రోలింగ్ చేస్తుండగా అనుమానాస్పదంగా కనిపించిన గుణచందర్‌ను ఆపి తనిఖీ చేయగా 230 గ్రాముల శుద్ధి చేసిన ఎండు గంజాయి లభించింది. సాక్షుల సమక్షంలో గంజాయిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ వివరించారు.

వర్గీకరణ చేయకపోతే సీఎంతో యుద్ధమే

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

కాజీపేట అర్బన్ : ఎస్సీ వర్గీకరణను అమలు చేయకపోతే సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌తో యుద్ధమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ హెచ్చరించారు. హనుమకొండ హంటర్ రోడ్డులోని డీ కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన ఉమ్మడి వరంగల్ జిల్లా మాదిగల ధర్మయుద్ధ మహాసభకు ముఖ్య అతిథిగా మంద కృష్ణ మాదిగ హాజరై మాట్లాడారు. 30 ఏళ్ల పోరాట ఫలితమే భారత అత్యున్నత న్యాయవ్యవస్థ ద్వారా సాధించుకున్న విజయాన్ని మాదిగలకు దక్కకుండా రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. అసెంబ్లీ సాక్షిగా రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని అమలు చేయాలన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేంత వరకు ఉద్యోగాల భర్తీలను నిలిపివేయాలని లేదంటే రేవంత్‌రెడ్డిపై ధర్మయుద్ధానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఎస్పీ నాయకులు మంద కుమార్ మాదిగ, సుకుమార్ మాదిగ, సూరన్న, దయాకర్, భిక్షపతి, సతీష్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో పత్తిలో పెరిగిన తేమశాతం


- నిబంధనలు సడలించాలని సీసీఐకి లేఖ
- సమస్యపై కలెక్టర్‌తో వ్యాపారుల చర్చ



పత్తి కొనుగోళ్ల సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న చాంబర్ ప్రతినిధులు, వ్యాపారులు

వరంగల్ : ఇటీవల కురిసిన వర్షాలతో 15 నుంచి 25 వరకు పత్తిలో తేమ శాతం పెరిగింది. రైతుల వద్ద కొనుగోలు చేస్తున్న సందర్భంలో ఇబ్బందులు పడుతున్నందున సీసీఐ నిబంధనలు సడలించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర జౌళిశాఖ మంత్రికి లేఖ రాసినట్లు తెలంగాణ కాటన్ అసోసియేషన్, వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ సత్యశారదను కలిసి వ్యవసాయ మార్కెట్‌లో రోజు వారి నిర్వహించే రైతు సరుకుల కొనుగోళ్లలో ఎదురవుతున్న సమస్యలు, సీసీఐ మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న పత్తి విషయంలో శుక్రవారం మార్కెట్‌లో జరిగిన ఆందోళనలపై రవీందర్‌రెడ్డి వివరించారు. పత్తిలో 12శాతం కంటే ఎక్కువ తేమ ఉంటే సీసీఐ కొనుగోలు చేయొద్దన్న నిబంధనలు ఉన్నాయన్నారు. రైతుల్లో వ్యాపారులపై అపోహలు సృష్టించి అసంతృప్తిని రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. స్పందించిన కలెక్టర్ మార్కెట్ అధికారులతో చర్చించి అలాంటి స్వార్థపర శక్తులతో జాగ్రత్తగా ఉండాలని వారిపై తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా కాటన్ అసోసియేషన్ అధ్యక్షుడు చింతలపల్లి వీరారావు, ఉపాధ్యక్షులు నాగమల్ల ఓంకారేశ్వర్, పింగిలి మల్లారెడ్డి, కోశాధికారి వేణుగోపాల్, చాంబర్ కోశాధికారి సంపత్, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఎంఓ సురేఖ, ఉన్నత శ్రేణి కార్యదర్శి నిర్మల, రాము, రాజేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి ప్రత్యేక పూజలు



గోదావరిలో పూలు వదులుతున్న జడ్జి దంపతులు

కాళేశ్వరం: తెలంగాణ రాష్ట్ర హైకోర్టు జడ్జి బీవీ వేణుగోపాల్‌రావు కుటుంబ సభ్యులతో మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని శనివారం దర్శించుకున్నారు. ఆయనకు అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభతో స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేక పూజా కార్యక్రమాల అనంతరం వారిని అమ్మవారి ఆలయంలో శేష వస్త్రాలతో సన్మానించి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జడ్జి దంపతులు ప్రత్యేక బోటులో గోదావరిలో పుణ్యస్నానాలు చేశారు. ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఓఎస్డీ బోనాల కిషన్, డీఎస్పీ రామ్మోహన్ రెడ్డి, సీఐ రామచంద్రారావు, ఎస్సై చక్రపాణి, డీటీ కృష్ణ, జిల్లా కోర్టు జడ్జిలు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీలు.. సీజ్



ఖిలా వరంగల్: వరంగల్ శివనగర్‌లోని హెల్త్ లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్, ఫోర్ట్ వరంగల్‌లో త్రివేణి ల్యాబొరేటరీ, ఫోర్ట్‌రోడ్డు పీఎంపీ రమేశ్ క్లినిక్‌లపై శనివారం మధ్యాహ్నం సిబ్బందితో కలిసి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కె.వెంకటరమణ ఆకస్మింగా తనిఖీ చేశారు. అర్హత, రిజిస్ట్రేషన్ లేకుండా నిర్వహిస్తున్నట్లు గుర్తించి హెల్త్‌లైన్ డయాగ్నొస్టిక్ సెంటర్ త్రివేణి ల్యాబొరేటరీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను సీజ్ చేసినట్లు వైద్యాధికారి వెంకటరమణ తెలిపారు. జిల్లాలోని క్లినిక్‌లు, ల్యాబ్‌లు, ఆస్పత్రులు, వెల్నెస్ సెంటర్లు, ఫిజియోథెరిపీ సెంటర్లు, కంటి దవాఖానలు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ అనిల్‌కుమార్, ఎస్ఓ విజయలక్ష్మి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అధికారులు అంకితభావంతో పనిచేయాలి

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి



మాట్లాడుతున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

సంగెం: అధికారులు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేస్తేనే ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కారం అవుతాయని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 15, 16, 17 డివిజన్ల పరిధిలోని రెడ్డిపాలెం, కీర్తినగర్‌కాలనీ, గరీబ్‌నగర్, జాన్‌పాక, ఆదర్శనగర్‌లో మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడేతో కలిసి శనివారం ఆయన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొగిలిచర్ల రైతు వేదికలో మున్సిపల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అర్హులకు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. ప్రజలు సమస్యలను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో సమస్యల పరిష్కారం కోసం పనిచేయాలన్నారు. డివిజన్లలో నెలకొన్న సమస్యలను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. శానిటేషన్, నీటి సరఫరా అస్తవ్యస్తంగా ఉందని, వైద్య సేవలు అందించాలని, గుడుంబా, గంజాయి నిర్మూలించాలని మొగిలిచర్ల గ్రామస్తులు కోరారు. సమావేశంలో తహసీల్దార్ రియాజుద్దీన్, వైద్యాధికారి పల్లవి, ఆర్ఐ సాంబయ్య, నాయకులు కొండేటి కొమురారెడ్డి, మున్సిపల్, రెవెన్యూ, వైద్య శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీసు అమరుల త్యాగాలు మరువొద్దు

- పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ



రక్తదాన శిబిరం వద్ద పీటీసీ ప్రిన్సిపాల్ పూజ

మామునూరు : జీవితాలనే త్యాగం చేసిన పోలీసు అమరవీరులను మరువొద్దని, వారి ఆశయాలతో మరింత ముందుకు వెళ్తూ దేశాన్ని కాపాడుకుందామని పీటీసీ ప్రిన్సిపాల్ ఇంజారపు పూజ సూచించారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలని ఆమె పేర్కొన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం మామునూరు పరిపాలనాధికారుల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పోలీస్ శిక్షణ కళాశాల యూనిట్ అస్పత్రి వైద్యులు డాక్టర్ సుధీర్ పర్యవేక్షణలో ఎంజీఎం బ్లడ్ బ్యాంకు డాక్టర్స్ ఆశాదేవి, గాయత్రి నిర్వహణలో 40యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ఆపదలో ఉన్న వారికి రక్తం కావాలంటే తాము ఉన్నామంటూ 40 మంది సిబ్బంది ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు రవీందర్, రమేశ్, భిక్షపతి, ఆర్ఐలు చంద్రశేఖర్, మహేష్, సత్యనారాయణ, సుధాకర్, దీపక్, వడ్డె నరేష్ కుమార్, మహేందర్, శ్రీకాంత్, సంజీవ్, ప్రసాద్, నాగరాజు, తాహెర్ అలీ హోంగార్డులు ఆహ్మద్, నరేష్, పీఆర్ఓ రామాచారి, సిబ్బంది పాల్గొన్నారు.

'ఇక బీసీలకే రాజ్యాధికారం'



మాట్లాడుతున్న దాసు సురేష్

హసన్‌పర్తి : ఇక బీసీలకే రాజ్యాధికారమని ఆ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ అన్నారు. శనివారం ఎర్రగట్టుగుట్ట సమీపంలోని బీసీ రాజ్యాధికార సమితి ప్రాంతీయ కార్యాలయంలో బీసీ నాయకత్వపు శిక్షణ, ఉమ్మడి వరంగల్ జిల్లా కమిటీల నిర్మాణం జరిగింది. ఈ కార్యక్రమానికి సురేష్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బలమైన క్షేత్ర స్థాయి నాయకత్వం నిర్మాణంతోనే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమవుతొందన్నారు. అందుకు క్షేత్రస్థాయి నిర్మాణంలో భాగంగా బీసీ ఓటును బయటకు పోనియకుండా కట్టడి చేసే దిశగా భవిష్యత్ కార్యచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే ఉత్తర తెలంగాణ వ్యాప్తంగా భారీ బహిరంగ సభను నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం మండలాల కమిటీలను ప్రకటించారు. ఈ కార్యక్రమంలో బీసీ రాజ్యాధికార మహిళా ఉపాధ్యక్షురాలు హైమావతి, కత్తుల కవిత, జిల్లా ఇన్‌చార్జ్ మంజుల, గౌరవ అధ్యక్షుడు రమేశ్‌గౌడ్‌తో పాటు వివిధ జిల్లాలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT & LAND FOR SALE

■ పర్కాల్‌లో మారుతి షోరూం ఎదురుగా (పరకాల to హన్మకొండ రోడ్) 146, 180, 240 N/E గజాలు ప్లాట్లు మరియు 1 ఎకరం భూమి అమ్మకానికి కలదు. సెల్: 9866921814. [W-1239929]

HOUSE FOR SALE

■ House for sale 164 Sq.yards West Face Near Releif Hospital Arepally WGL 70 Lakhs. Cell: 9652715142. [W-1237347]

FLAT FOR SALE

■ Ready- To- Move New 2BHK 835 & 935 SFT Flats. Canara Nagar, Near Boduppal - HYD Beside Ushodaya Super Market. Posh Locality. Ph: 8247452676. [HA-822]

PLOT FOR SALE

■ యాదగిరిగుట్ట, వంగపల్లిలో గేటెడ్ కమ్యూనిటీ యందు బ్యాంకు లోన్ సౌకర్యంతో ఓపెన్ ప్లాట్లు కలవు. రిసార్ట్స్, స్విమ్మింగ్‌పూల్, పార్క్ అన్ని వసతులతో. Ph: 8106340199 [HA-14739]

SERVICES

హోమ్ కేర్ సెంటర్

■ శ్రీనివాస హోమ్ కేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, పిల్లలను చూసుకొనుటకు ఇంటి / వంట పనికి వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 20K. Hyd, WGL. 8978753136. [W-1237333]

FINANCIAL SERVICES

■ బాలాజీ లోన్స్ తక్కువ వడ్డీకే చేయబడును. బిజినెస్, మార్టిగేజ్, హోమ్, టేకోవర్ లోన్స్, ప్లాట్ లోన్ ఇవ్వబడును. I.T. రిటన్స్, G.S.T, పాన్‌కార్డ్. కాకతీయ థియేటర్ దగ్గర, వరంగల్. 85228 25358. [M-1185413]

తాజా వార్తల కోసం లాగాన్ అవ్వండి www.sakshi.com

WANTED

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Q: 10th- డిగ్రీ, Sal: 20K-30K. మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [W-1239927]

■ ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను, పిల్లలను చూసుటకు వర్కర్స్/నర్సులు కావాలి. ఫ్రీ వసతి ఫుడ్ , జీ: 20K, Ph: 8977639662, 8977639663 [SCA24000512]

■ షిరిడీ సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో నర్సులు, ఆయాలు, భార్యాభర్తలు, వార్డ్ బాయ్స్, కాంపౌండర్స్, సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-14726]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



జోహర్ కప్‌లో యువ భారత్‌కు కాంస్య పతకం

సుల్తాన్ జొహర్ కప్ అండర్–21 అంతర్జాతీయ పురుషుల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు కాంస్య పతకం కైవసం చేసుకుంది. మలేసియా వేదికగా శనివారం జరిగిన కాంస్య పతక పోరులో భారత జట్టు షూటౌట్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి కాంస్యం ఖాతాలో వేసుకుంది. గోల్‌కీపర్ బిక్రమ్‌జిత్ సింగ్ ప్రత్యర్థి మూడు గోల్స్ ప్రయత్నాలను అడ్డుకోవడంతో భారత జట్టు విజయం సాధించింది. నిర్ణీత సమయంలో ఇరు జట్లు రెండేసి గోల్స్ చేయగా... ఫలితం తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో భారత్ 3–2తో గెలుపొందింది. షూటౌట్‌లో భారత్ తరఫున గుర్‌జోత్ సింగ్, మన్‌మీత్ సింగ్, సౌరభ్ ఆనంద్ గోల్ కొట్టారు. అంతకుముందు భారత్ తరఫున దిల్‌రాజ్ సింగ్ (11వ నిమిషంలో), మన్‌మీత్ సింగ్ (20వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... న్యూజిలాండ్ తరఫున బ్రౌన్ (51వ ని.లో), జాంటీ ఎల్మ్స్ (57వ ని.లో) చెరో గోల్ చేశారు. ఆరంభం నుంచి మ్యాచ్‌పై పట్టు కొనసాగించిన భారత జట్టు... చివరి క్వార్టర్‌లో ప్రత్యర్థికి కోలుకునే అవకాశం ఇచ్చింది.

‘కివీ’ చేతుల్లో ఖేల్ ఖతం!

అనూహ్యం, అసాధారణమేమీ జరగలేదు... న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో భారత బ్యాటర్లు రెండో ఇన్నింగ్స్‌లోనూ తమ వైఫల్యాన్ని కొనసాగించారు...భారీ లక్ష్యాన్ని ఛేదించలేక కుప్పకూలి సిరీస్‌ను అప్పగించేశారు... సొంతగడ్డపై కూడా స్పిన్‌ను ఆడలేని తమ బలహీనతను మళ్లీ ప్రదర్శిస్తూ టీమిండియా తలవంచింది...ఫలితంగా పుష్కర కాలం తర్వాత స్వదేశంలో టెస్టు సిరీస్ చేజారింది... ఒక్క యశస్వి జైస్వాల్ మాత్రమే ధాటిగా ఆడి ఆశలు రేపినా... మిగతావారంతా చేతులెత్తేయడంతో మూడో రోజుకే మ్యాచ్ ముగిసింది... కివీ బౌలర్ సాంట్నర్ మరోసారి తన మాయాజాలం ప్రదర్శిస్తూ ఆరు వికెట్లతో చెలరేగాడు. శ్రీలంక చేతిలో చిత్తుగా ఓడి ఏమాత్రం అంచనాలు, ఆశలు లేకుండా భారత గడ్డపై అడుగుపెట్టిన న్యూజిలాండ్ బృందం అసాధారణ ప్రదర్శనతో ఏకంగా 2–0తో సిరీస్‌నే గెలుచుకోవడం విశేషం. ఇక భారత్ ముందు మిగిలింది చివరి మ్యాచ్‌లో నెగ్గి కాస్త పరువు కాపాడుకోవడమే!



విజయానందంలో న్యూజిలాండ్ ఆటగాళ్లు



సాంట్నర్

రెండో టెస్టులో భారత్ ఓటమి

- 113 పరుగుల తేడాతో న్యూజిలాండ్ ఘన విజయం
- 2–0తో సిరీస్ సొంతం
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 245 ఆలౌట్
- శుక్రవారం నుంచి చివరి టెస్టు

పుణే: స్వదేశంలో భారత జట్టు అనూహ్య రీతిలో టెస్టు సిరీస్‌ను కోల్పోయింది. శనివారం ముగిసిన రెండో టెస్టులో న్యూజిలాండ్ 113 పరుగుల తేడాతో భారత్‌ను చిత్తు చేసింది. తొలి మ్యాచ్‌లోనూ నెగ్గిన ఆ జట్టు మరో టెస్టు మిగిలి ఉండగానే సిరీస్‌ను 2–0తో సొంతం చేసుకుంది. 359 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 60.2 ఓవర్లలో 245 పరుగులకు ఆలౌటైంది. యశస్వి జైస్వాల్ (65 బంతుల్లో 77; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు) దూకుడుగా ఆడి అర్ధసెంచరీ చేయగా, రవీంద్ర జడేజా (84 బంతుల్లో 42; 2 ఫోర్లు) చివర్లో కాస్త పోరాడాడు. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ మిచెల్ సాంట్నర్ (6/104) మరోసారి భారత్‌ను దెబ్బ కొట్టాడు. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 198/5తో ఆట కొనసాగించిన న్యూజిలాండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 69.4 ఓవర్లలో 255 పరుగులకు ఆలౌటైంది. ఫిలిప్స్ (48 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), బ్లన్‌డెల్ (41; 3 ఫోర్లు) కీలక పరుగులు సాధించారు. భారత బౌలర్లలో సుందర్ 4, జడేజా 3 వికెట్లు తీశారు. ఇరు జట్ల మధ్య మూడో టెస్టు నవంబర్ 1 నుంచి ముంబైలో జరుగుతుంది.

జైస్వాల్ మినహా...

క్రీజులో జైస్వాల్ ఉన్నంత సేపు భారత జట్టు లక్ష్యంపై గురి పెట్టి దూకుడైన ఆటను ప్రదర్శించేందుకు సిద్ధమైందని అనిపించింది. ఒక వైపు రోహిత్ (8) మళ్లీ విఫలమైనా...మరో ఎండ్‌లో జైస్వాల్ తొలి ఓవర్‌నుంచే బౌండరీలతో చెలరేగాడు. అతనికి శుబ్‌మన్ గిల్ (23) కూడా కొద్ది సేపు సహకరించాడు. లంచ్ సమయానికి భారత్ 81/1తో మెరుగైన స్థితిలో కనిపించగా... విరామం తర్వాత 41 బంతుల్లోనే జైస్వాల్ అర్ధసెంచరీ పూర్తయింది. అయితే రెండో సెషన్‌లో గిల్‌ను అవుట్ చేసి పతనానికి శ్రీకారం చుట్టిన సాంట్నర్ ఆ తర్వాత జైస్వాల్ వికెట్‌నూ ఖాతాలో వేసుకున్నాడు. మరో ఐదు బంతులకే పంత్ (0) అనవసరపు సింగిల్‌కు ప్రయత్నించి రనౌట్ కావడం జట్టును మరింత దెబ్బ తీసింది. కోహ్లి పాయింట్ దిశగా ఆడి పరుగు ప్రారంభించగా... పంత్ మరో ఆలోచన లేకుండా దూసుకొచ్చాడు. అయితే అతను డైవ్ చేసినా లాభం లేకపోయింది. కోహ్లి (17)ని సాంట్నర్ ఎల్బీగా దొరకబుచ్చుకోగా, భారత బ్యాటర్ రివ్యూ చేసినా ఫలితం దక్కలేదు. అనంతరం రెండు పరుగుల వ్యవధిలో సర్ఫరాజ్ (9), సుందర్ (21) అవుటయ్యారు. జడేజా, అశ్విన్ (18) కొద్ది సేపు ప్రతిఘటించినా... అదీ ఎక్కువ సేపు సాగలేదు. అంతకు ముందు న్యూజిలాండ్ మూడో రోజు మరో 16.4 ఓవర్లు ఆడి మరో 57 పరుగులు జోడించగలిగింది.

స్కోరు వివరాలు:

న్యూజిలాండ్ తొలి ఇన్నింగ్స్ 259; భారత్ తొలి ఇన్నింగ్స్ 156; న్యూజిలాండ్ రెండో ఇన్నింగ్స్: లాథమ్ (ఎల్బీ) (బి) సుందర్ 86; కాన్వే (ఎల్బీ) (బి) సుందర్ 17; యంగ్ (ఎల్బీ) (బి) అశ్విన్ 23; రచిన్ (బి) సుందర్ 9; మిచెల్ (సి) జైస్వాల్ (బి) సుందర్ 18; బ్లన్‌డెల్ (బి) జడేజా 41; ఫిలిప్స్ (నాటౌట్) 48; సాంట్నర్ (సి) బుమ్రా (బి) జడేజా 4; సౌతీ (సి) రోహిత్ (బి) అశ్విన్ 0; ఎజాజ్ (సి) సుందర్ (బి) జడేజా 1; రూర్కే (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (69.4 ఓవర్లలో ఆలౌట్) 255.** **వికెట్ల పతనం:** 1–36, 2–78, 3–89, 4–123, 5–183, 6–231, 7–237, 8–238, 9–241, 10–255. **బౌలింగ్:** అశ్విన్ 25–2–97–2, సుందర్ 19–0–56–4, జడేజా 19.4–3–72–3, బుమ్రా 6–1–25–0. **భారత్ రెండో ఇన్నింగ్స్:** జైస్వాల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 77; రోహిత్ (సి) యంగ్ (బి) సాంట్నర్ 8; గిల్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 23; కోహ్లి (ఎల్బీ) (బి) సాంట్నర్ 17; పంత్ (రనౌట్) 0; సుందర్ (సి) యంగ్ (బి) ఫిలిప్స్ 21; సర్ఫరాజ్ (బి) సాంట్నర్ 9; జడేజా (సి) సౌతీ (బి) పటేల్ 42; అశ్విన్ (సి) మిచెల్ (బి) సాంట్నర్ 18; ఆకాశ్‌దీప్ (సి) రచిన్ (బి) ఎజాజ్ 1; బుమ్రా (నాటౌట్) 10; ఎక్స్‌ట్రాలు 19; **మొత్తం (60.2 ఓవర్లలో ఆలౌట్) 245.** **వికెట్ల పతనం:** 1–34, 2–96, 3–127, 4–127, 5–147, 6–165, 7–167, 8–206, 9–229, 10–245. **బౌలింగ్:** సౌతీ 2–0–15–0, రూర్కే 1–0–5–0, సాంట్నర్ 29–2–104–6, ఎజాజ్ 12.2–0–43–2, ఫిలిప్స్ 16–0–60–1.

12 భారత జట్టు స్వదేశంలో 12 ఏళ్ల తర్వాత టెస్టు సిరీస్ కోల్పోయింది. 2012లో ఇంగ్లండ్ చేతిలో టీమిండియా 1–2తో ఓడింది.

18 తాజా ఓటమికి ముందు స్వదేశంలో భారత్ వరుసగా గెలిచిన సిరీస్‌ల సంఖ్య.

1 భారత గడ్డపై న్యూజిలాండ్‌కు ఇదే తొలి టెస్టు సిరీస్ విజయం. గతంలో కివీస్ ఇక్కడ 12 సిరీస్‌లు ఆడగా...10 ఓడి 2 డ్రా చేసుకుంది.

‘పరాభవ భారం’

‘నాపై ఇక కత్తులు దూయండి’... బెంగళూరు టెస్టులో 46కు ఆలౌట్ అయిన తర్వాత మీడియా సమావేశంలో రోహిత్ శర్మ వ్యాఖ్య ఇది!

‘12 ఏళ్ల తర్వాత ఒక సిరీస్ ఓడిపోయాం ...ఈమాత్రం మినహాయింపు ఇవ్వడంలో తప్పు లేదు’...రెండో టెస్టులో ఓటమి అనంతరం అదే కెప్టెన్ చెప్పిన మాట ఇది.



ఇన్నేళ్లుగా తమ ఆటతో విజయాలనే తాము అలవాటు చేశామని, కాబట్టి పరాజయం అందరికీ కొత్తగా అనిపిస్తోందని కూడా రోహిత్ అన్నాడు. అంటే 46 ఆలౌట్‌ను ఒకానొక అరుదైన రోజుగా అంగీకరించిన కెప్టెన్‌కు ఇప్పుడు ఓటమి అలవాటైపోయినట్లుగా అనిపించింది! అయితే ఈ పుష్కర కాలంలో అప్పుడప్పుడు వచ్చిన మ్యాచ్ పరాజయాలకు, తాజాగా సిరీస్ కోల్పోవడానికి మధ్య చాలా తేడా ఉంది. ఇన్నేళ్లలో ఇంగ్లండ్, ఆ్రస్టేలియాలాంటి టీమ్‌లు భారత్‌ను ఓడించేందుకు తీవ్రంగా ప్రయత్నించాయి. మ్యాచ్‌లు గెలిచినా అవి సిరీస్‌ను మాత్రం సొంతం చేసుకోలేకపోయాయి. వీటితో పోలిస్తే న్యూజిలాండ్ టెస్టుల్లో అనామక జట్టు కిందే లెక్క. దీనికి ముందు 12 సిరీస్‌లలో కలిపి ఆ టీమ్ ఇక్కడ రెండే మ్యాచ్‌లు గెలవగలిగింది. పైగా ఇటీవలే శ్రీలంక చేతిలో 0–2తో చిత్తుగా ఓడి ఇక్కడకు వచ్చింది. సౌతీ, లాథమ్‌లకు మినహా మిగతావారెవరికీ ఇక్కడ టెస్టులు ఆడిన అనుభవం ఎక్కువగా లేదు. కేన్ విలియమ్సన్‌లాంటి స్టార్ ప్లేయర్ కూడా అందుబాటులో లేడు. అయినా సరే కివీస్ టీమ్ భారత్‌పై పైచేయి సాధించగలిగింది. రెండు పూర్తిగా భిన్నమైన పిచ్‌లపై ఆ జట్టు పైచేయి సాధించిన తీరు టీమిండియా లోపాలను చూపించింది. ముందుగా బెంగళూరు టెస్టులో పేస్ బౌలింగ్ ముందు భారత్ మోకరిల్లి చెత్త రికార్డులను నమోదు చేసింది. దాంతో హడావిడిగా మన బలం స్పిన్ అంటూ పూర్తిగా స్పిన్ పిచ్‌తో సిద్ధమైంది. కానీ ముందు మన బ్యాటర్లు అలాంటి పిచ్‌పై, స్పిన్‌ను సమర్థంగా ఆడగలరా లేదా అనే ఆలోచన రానట్లుంది! అందుకే సాంట్నర్ స్పిన్‌ను కూడా ఎదుర్కోలేకపోయింది. 2017లో ఇదే పుణేలో, ఇదే తరహా పిచ్‌పై ఇలాంటి లెఫ్టార్మ్ స్పిన్నర్ స్టీవ్ ఒ కీఫ్‌కు 12 వికెట్లు అప్పగించి ఆసీస్ చేతిలో భారత్ 333 పరుగులతో చిత్తయింది. ఇప్పుడు కూడా పదునైన స్పిన్‌ను ఆడటం తమ వల్ల కాదని మన బ్యాటర్లు నిరూపించారు. పిచ్‌పై గిర్రున తిరుగుతున్న బంతులకు వారి వద్ద జవాబు లేకపోయింది. బంగ్లాలాంటి బలహీన జట్టుపై దూకుడైన ఆటతో సిరీస్ గెలిచిన వైనంతో మన ప్లేయర్లలో అతి విశ్వాసం పెరిగినట్లు కనిపించింది. పైగా న్యూజిలాండ్ టెస్టుల్లో ప్రభావం చూపలేదనే తేలికపాటి భావం కూడా కావచ్చు! సిరీస్‌లో రోహిత్ విఫలం కాగా, కోహ్లి తన ఆటతో తీవ్రంగా నిరాశపర్చాడు. జైస్వాల్ ఒక్కడే ఆకట్టుకోగా, రెండో ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్ అతని నిర్లక్ష్యాన్ని చూపించింది. సాంట్నర్ చెలరేగిన చోట అదే శైలి బౌలర్ అయిన జడేజాకు తొలి ఇన్నింగ్స్‌లో ఒక్క వికెట్ కూడా దక్కలేదు. ఇదే టీమ్ ఆ్రస్టేలియాకు వెళ్లి గెలుస్తుందనుకోవడం అత్యాశే. మరో వైపు కోచ్ గౌతమ్ గంభీర్‌కు కూడా ఈ ఓటమిలో పాత్ర ఉంది. బంగ్లాపై సిరీస్ విజయాన్ని గొప్పగా చెప్పుకుంటూ...‘ఒక్క రోజులో 400 పరుగులు చేయగల, అవసరమైతే రెండు రోజులు నిలబడి డ్రా చేసుకోగల జట్టుగా మేం మారాలి. నా దృష్టిలో ఆటలో ఎదగడం అంటే అదే’ అంటూ వ్యాఖ్య చేశాడు. 400 సంగతేమో కానీ మన బ్యాటింగ్ బలహీనత ఏమిటో ఇది చూపించింది. శ్రీలంక చేతిలో 27 ఏళ్ల తర్వాత వన్డే సిరీస్ ఓటమి, 46 ఆలౌట్, 36 ఏళ్ల తర్వాత కివీస్ చేతిలో టెస్టు పరాజయం, ఇప్పుడు తొలిసారి సిరీస్, 12 ఏళ్ల తర్వాత స్వదేశంలో పరాభవం...ఇవన్నీ కూడా కోచ్ గంభీర్ ఖాతాలో చేరాల్సినవే! ఇకపై మాటలను కట్టిపెట్టి కోచ్‌గా తన బాధ్యతలు సరిగ్గా నెరవేర్చాల్సిన సమయమిది.

–సాక్షి క్రీడావిభాగం

4 రోహిత్ కెప్టెన్సీలో స్వదేశంలో భారత్ ఓడిన టెస్టుల సంఖ్య. గతంలో అజహర్, కపిల్ కెప్టెన్సీలో 4 మ్యాచ్‌లు ఓడగా... పటౌడీ నాయకత్వంలో భారత్ 9 మ్యాచ్‌లు ఓడింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సినిమా



రాజ్‌కుమార్ పెరియసామి, శివ కార్తికేయన్, సాయి పల్లవి, సుధాకర్ రెడ్డి, నాగ్ అశ్విన్


ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో నిలిచిపోతాయి

- దర్శకుడు నాగ్ అశ్విన్

‘‘**అమరన్**’ అద్భుతమైన కథ. రియల్ స్టోరీ తీసినప్పుడు చాలా బాధ్యత ఉంటుంది. ఇలాంటి కథలు ప్రేక్షకుల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయి. కమల్‌హాసన్‌గారు ఈ సినిమాని నిర్మించడం గొప్ప విషయం. ఈ సినిమా పెద్ద విజయం సాధించాలి’’ అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. శివ కార్తికేయన్, సాయి పల్లవి జంటగా నటించిన చిత్రం ‘అమరన్’. రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో కమల్‌హాసన్, ఆర్. మహేంద్రన్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 31న తమిళ, తెలుగు భాషల్లో విడుదల కానుంది. ఈ చిత్రాన్ని తెలుగులో శ్రేష్ఠ్ మూవీస్ పతాకంపై సుధాకర్ రెడ్డి, నిఖితా రెడ్డి రిలీజ్ చేస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో ముఖ్య అతిథిగా దర్శకుడు నాగ్ అశ్విన్ పాల్గొన్నారు. ఈ వేదికపై శివ కార్తికేయన్ మాట్లాడుతూ – ‘‘మేజర్ ముకుంద్ వరదరాజన్, ఇందు రెబెకా బయోపిక్‌గా రూపొందిన చిత్రం ‘అమరన్’. ఉద్యోగాన్ని ప్రేమించే కుటుంబం ఎలా ఉంటుందో డైరెక్టర్ రాజకుమార్ అద్భుతంగా చూపించారు. ఈ సినిమాలో నేను మేజర్ ముకుంద్ వరదరాజన్ పాత్ర చేశాను. ‘అమరన్’ లాంటి చిత్రాన్ని సపోర్ట్ చేస్తే ఇలాంటి రియల్ హీరో స్టోరీస్ ఇంకెన్నో వస్తాయి’’ అన్నారు. ‘‘అమరన్’ సినిమాతో మీ ముందుకు రావడం గర్వంగా ఉంది’’ అని సాయి పల్లవి తెలిపారు. ‘‘దేశవ్యాప్తంగా సెలబ్రేట్ చేసుకునే సినిమా ఇది. కమల్‌హాసన్‌గారి వల్లే ఈ ప్రాజెక్టు సాధ్యమైంది. ఈ సినిమాని ఇంత పెద్ద స్థాయిలో తెలుగులో రిలీజ్ చేస్తున్న సుధాకర్ రెడ్డి సార్‌కి కృతజ్ఞతలు’’ అన్నారు రాజ్‌కుమార్ పెరియసామి. ఈ వేడుకలో నిర్మాత ‘ఠాగూర్’ మధు, పాటల రచయిత రామజోగయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

Gold Memories
మనిషి జీవితానికి ప్రతిబింబం సినిమా. ఎన్నో అద్భుతమైన చిత్రాలు మన మదిలో జ్ఞాపకాలుగా ఉన్నాయి. అవి బంగారు జ్ఞాపకాలు. అందుకే ‘సాక్షి యూట్యూబ్’ ఇక ప్రతివారం ఓ సినిమాతో మీ మనస్సును తట్టే ప్రయత్నం చేస్తుంది ‘గోల్డెన్ మెమొరీస్’ రూపంలో. ఈ వారం ‘గోల్డెన్ మెమొరీస్’లో ఓ ఆణిముత్యం అయిన ‘పెళ్లిపుస్తకం’ గురించి తెలుసుకోవాలంటే ఈ క్యూఆర్ కోడ్‌ని స్కాన్ చేస్తే చాలు.

యాభైఏళ్ల రాజీనామా



చిరంజీవి

Mr. K. S. S. V. Prasada Rao, II B. Com.,
Best actor of the college 1974–75.

కొణిదెల శివ శంకర వరప్రసాద్.... ఈ పేరు తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే. హీరో చిరంజీవి అసలు పేరు ఇదే అని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కాగా శివ శంకర వరప్రసాద్‌గా రంగస్థలంపై ‘రాజీనామా’ అనే నాటకంతో మొదలైన ఆయన నట ప్రస్థానం యాభై ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా చిరంజీవి ఓ ఫొటోను తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసి, ‘‘1974లో నర్సపూర్‌లోని వైఎన్‌ఎమ్ కళాశాలలో బీకామ్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నప్పుడు రంగస్థలం మీద నేను వేసిన తొలి నాటకం ‘రాజీనామా’. కోన గోవిందరావుగారు రచించారు. నాకు నటుడిగా తొలి గుర్తింపు ఇచ్చింది ‘రాజీనామా’. అది కూడా బెస్ట్ యాక్టర్‌గా అవార్డు రావడం ఎనలేని ప్రోత్సాహం ఇచ్చింది. 1974–2024... యాభై సంవత్సరాల నట ప్రస్థానం ఎనలేని ఆనందాన్ని ఇచ్చింది’’ అంటూ రాసుకొచ్చారు చిరంజీవి. ఇదిలా ఉంటే.. చిరంజీవి నటించిన తొలి చిత్రం ‘పునాది రాళ్ళు’. ఈ సినిమాకి గూడపాటి రాజ్‌కుమార్ దర్శకత్వం వహించారు. అయితే ఈ చిత్రం విడుదల ఆలస్యం కావడంతో చిరంజీవి నటించిన ‘ప్రాణం ఖరీదు’ సినిమా మొదట రిలీజ్ అయింది. ‘ప్రాణం ఖరీదు’ చిత్రం 1978 సెప్టెంబరు 22న విడుదల కాగా ‘పునాది రాళ్ళు’ 1979 జూన్ 21న రిలీజ్ అయింది. కాగా ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న చిత్రం ‘విశ్వంభర’. వశిష్ఠ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని వంశీ, ప్రమోద్, విక్కీ నిర్మిస్తున్నారు.

ప్రేక్షకులు ఆశ్చర్యపోతారు

- కిరణ్ అబ్బవరం



నయన్ సారిక, కిరణ్ అబ్బవరం, తన్వీ రామ్

‘**క**’ కథ విన్నప్పుడు ఇలాంటి మంచి సినిమాను ప్రేక్షకులకు చూపించాలనిపించింది. ఈ సినిమా క్లైమాక్స్ చూసి ఆడియన్స్ ఆశ్చర్యపోతారు. ‘క’ సినిమాలోని ఏదైనా ఎలిమెంట్‌ను గతంలో స్క్రీన్‌పై చూశామని మీకు (ఆడియన్స్) అనిపిస్తే నేను సినిమాలు చేయడం మానేస్తా’’ అని కిరణ్ అబ్బవరం అన్నారు. సుజీత్–సందీప్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా, నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటించిన పీరియాడికల్ మూవీ ‘క’. చింతా వరలక్ష్మి సమర్పణలో చింతా గోపాలకృష్ణా రెడ్డి నిర్మించారు. ఈ నెల 31న ఈ సినిమాను తెలుగులో వంశీ నందిపాటి రిలీజ్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరుల సమావేశంలో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – ‘క’లో పోస్ట్‌మ్యాన్ వాసుదేవ్‌గా కనిపిస్తాను. తోటి వారి జీవితంలో ఏం జరుగుతుందో తెలుసుకోవాలని వాళ్ల ఉత్తరాలు చదువుతుంటాడు వాసుదేవ్. ఈ క్రమంలో అతని జీవితం ఎలా టర్న్ తీసుకుంది? అన్నది కథాంశం. వాసుదేవ్ పాత్రలో డిఫరెంట్ షేడ్స్ ఉంటాయి. మా సినిమాను కన్నడ, మలయాళ, తమిళ భాషల్లో రిలీజ్ చేయాలనుకున్నాం... థియేటర్స్ దొరకలేదు. ప్రస్తుతం తెలుగులో రిలీజ్ చేస్తున్నాం. వారం తర్వాత మిగతా భాషల్లో రిలీజ్ చేసే ప్రయత్నం చేస్తాం’’ అన్నారు. ‘‘సినిమా ఆరంభం కాగానే ఆడియన్స్ ‘క’ ప్రపంచంలోకి వెళ్తారు’’ అన్నారు సందీప్. ‘‘‘క’కు ప్రేక్షకాదరణ లభిస్తుందనే నమ్మకం ఉంది’’ అని చెప్పారు వంశీ నందిపాటి.



రీతూ వర్మ మజాకా

హీరో సందీప్ కిషన్‌తో కలిసి మజాకా చేస్తున్నారు హీరోయిన్ రీతూ వర్మ. సందీప్ కిషన్, రీతూ వర్మ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం ‘మజాకా’. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ పతాకాలపై రాజేష్ దండా నిర్మిస్తున్న చిత్రం ఇది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ వైజాగ్‌లో జరుగుతోంది. కాగా ‘మజాకా’ సినిమాలో రీతూ వర్మ హీరోయిన్‌గా నటిస్తున్నట్లుగా వెల్లడించి, వైజాగ్ సెట్స్‌లో రీతూ వర్మ జాయిన్ అయినట్లుగా చిత్రయూనిట్ శనివారం అధికారికంగా వెల్లడించింది. ప్రస్తుతం పెళ్లి బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోందని తెలుస్తోంది. వచ్చే సంక్రాంతికి విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతం: లియోన్ జేమ్స్.

అందమైన ప్రేమకథ



విహాన్షి, షెరాజ్, నేహా దేశ్ పాండే, భాష్య శ్రీ

షెరాజ్ మెహదీ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం ‘ఓ అందాల రాక్షసి’. హీరోయిన్లు విహాన్షి హెగ్డే, కృతీ వర్మ, నేహా దేశ్ పాండే నటించారు. సుమన్, తమ్మారెడ్డి భరద్వాజ కీలక పాత్రలు పోషించారు. షేర్ సమర్పణలో స్కై ఈజ్ ది లిమిట్ బ్యానర్‌పై సురేందర్ కౌర్ నిర్మించిన ఈ చిత్రం త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో డైరెక్టర్, హీరో, మ్యూజిక్ డైరెక్టర్ షెరాజ్ మెహదీ మాట్లాడుతూ– ‘‘ఓ అందాల రాక్షసి’ గ్లామర్ బేస్డ్ మూవీ కాదు. మంచి కంటెంట్ ఉన్న అందమైన ప్రేమకథ. అమాయక మహిళలు కొందరి చేతిలో ఎలా మోసపోతున్నారు?. మోసం చేసేవారికి ఎలాంటి శిక్ష ఉంటుంది? అని ఈ మూవీలో చూపిస్తున్నాం’’ అని తెలిపారు. ‘‘ఓ అందాల రాక్షసి’ సినిమాకు కథ, మాటలు, పాటలు రాశాను’’ అని భాష్య శ్రీ చెప్పారు.

కేజీఎఫ్‌కు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది

- దర్శకుడు సూరి



శ్రీ మురళి హీరోగా డా. సూరి దర్శకత్వంలో రూపొందిన చిత్రం ‘బఘీర’. ఇందులో రుక్మిణీ వసంత్ హీరోయిన్‌గా నటించారు. హోంబలే ఫిలింస్ పతాకంపై విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రదర్శకుడు డా. సూరి మాట్లాడుతూ– ‘‘ప్రశాంత్ నీల్‌గారి ‘కేజీఎఫ్, సలార్’ చిత్రాల రైటింగ్ విభాగంలో నేనూ ఉన్నాను. శ్రీ మురళిగారితో నేను ఒక సినిమా చేద్దామనుకున్నప్పుడు కథ కుదర్లేదు. అప్పుడు తన దగ్గర కథ ఉందని ప్రశాంత్ నీల్‌గారు చెప్పడంతో ‘బఘీర’ చిత్రం ప్రారంభమైంది. సూపర్ హీరో అవ్వాలనుకున్న ఓ కుర్రాడి కథే ఈ చిత్రం. ఈ సినిమా అవుట్‌పుట్ చూసి ప్రశాంత్ నీల్‌గారు హ్యాపీ ఫీలయ్యారు. శ్రీ మురళి బాగా నటించారు. ‘బఘీర’ను ‘కేజీఎఫ్’తో పోల్చి మాట్లాడుతున్నారు. ‘బఘీర’ సినిమా ‘కేజీఎఫ్’ టోన్‌లో ఉండదు. ‘కేజీఎఫ్’ చరిత్రలాంటి సినిమా. ఈ సినిమాకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది’’ అన్నారు. ఇంకా మాట్లాడుతూ– ‘‘పన్నెండేళ్ల క్రితం యశ్‌తో ఓ సినిమా చేశాను (‘లక్కీ’). ఆ తర్వాత యశ్‌తో ట్రావెల్ అయ్యాను. యశ్ కథలను నేనే వినేవాడిని. అయితే యశ్‌తో నేను అనుకున్న సినిమా వర్కౌట్ కాలేదు. ఆ తర్వాత ‘కేజీఎఫ్’ వల్ల యశ్‌కు చాలా సమయం పట్టింది. దీంతో నేను శ్రీ మురళితో ‘బఘీర’ చేశాను’’ అని తెలిపారు.

ఓటీటీ ఇది చూడొచ్చు

ఈ కలయిక కాస్త ఘాటు గురూ...

ఓటీటీలో ‘ఇది చూడొచ్చు’ అనే ప్రాజెక్ట్స్ చాలా ఉంటాయి. ప్రస్తుతం స్ట్రీమ్ అవుతున్న వాటిలో హాలీవుడ్ చిత్రం ‘ది యూనియన్’ ఒకటి. ఈ చిత్రం గురించి తెలుసుకుందాం.



ఎక్కడైనా ప్రేమికులు చాలా ఏళ్ల తరువాత కలిస్తే, చాలా హాట్ హాట్‌గా ఉంటుంది. కానీ ఈ ‘ది యూనియన్’ సినిమాలో పాత ప్రేమికులు కలిసిన తరువాత ఇంత ఘాటా అని చూసే ప్రేక్షకుడు నోరెళ్లబెట్టాల్సిందే. అంతలా ఏముందీ సినిమాలో ఓసారి విశ్లేషించుకుందాం. జూలియన్ ఫరియానో దర్శకత్వం వహించిన స్పై కామెడీ థ్రిల్లర్ సినిమా ‘ది యూనియన్’. నెట్‌ఫ్లిక్స్ ఓటీటీలో తెలుగులోనూ ఈ సినిమాని చూడవచ్చు. హేమాహేమీలైన హాలీబెర్రీ, మార్క్ వాబర్గ్, మైక్ కాల్టర్ నటించిన ఈ సినిమా పెద్దలకు మాత్రమే. ఇక ఈ సినిమా కథాంశానికొస్తే... కథానాయకుడు మైక్ మెకన్నా న్యూజెర్సీ నగరంలో ఓ సాధారణ బిల్డింగ్ కార్మికుడు. రోజువారీ కష్టంతో తన పనేదో తాను చూసుకుపోయే మనస్తత్వం గలవాడు. కాకపోతే కాస్తంత అమ్మాయిల పట్ల పిచ్చి ఎక్కువ. హాయిగా సాగుతున్న మైక్ జీవితంలో అనుకోని ఓ అవాంతరం తన హైస్కూల్ క్రష్ అయిన రోక్సేన్ హాల్ ద్వారా ఎదురవుతుంది. 25 ఏళ్ల తరువాత కలిసిన తన ప్రేమను గుర్తు చేసుకుంటూ డాన్స్ చేస్తూ స్పృహ తప్పుతాడు మైక్. అలా న్యూజెర్సీలో స్పృహ తప్పిన మైక్ తిరిగి కళ్లు తెరిచేసరికి లండన్‌లో ఉంటాడు. మరోపక్క ఓ బ్రీఫ్‌కేస్ కోసం ఇరాన్ తీవ్రవాదులు, నార్త్ కొరియా ఏజెంట్లు, రష్యన్ గూఢచారులు తెగ వెతికేస్తుంటారు. ఆ బ్రీఫ్‌కేస్‌లో చాలా సెన్సిటివ్ ఇన్ఫర్మేషన్ ఉంటుంది. దాని కోసం యూనియన్ అనే సంస్థ తమ ప్రతినిధులను చాలా మందినే పోగొట్టుకుంటుంది. అసలు ఆ బ్రీఫ్‌కేస్‌కి, కథానాయకుడు మైక్‌కి సంబంధం ఏంటి? 25 ఏళ్ల తరువాత మైక్ ప్రియురాలు రోక్సేన్ హేల్ అతన్ని ఎందుకు కలిసింది? కలిసిన తరువాత అతను లండన్‌లో ఉండడం ఏంటి? అయినా ఓ ప్రేమికుల కలయికలో ఇంత ఘాటైన ట్విస్టులా? వీటి సమాధానాల కోసం ‘ది యూనియన్’ సినిమా చూడాల్సిందే. ఈ సినిమా ప్రేక్షకుడిని గిలిగింతలు పెట్టిస్తూ ఆద్యంతం థ్రిల్లింగ్ కలిగిస్తుందనడంలో సందేహం లేదు. వీకెండ్ మస్ట్ వాచ్ మూవీ ‘ది యూనియన్’.

– ఇంటూరు హరికృష్ణ